క్లుప్తంగా

మృత్యుంజయ హోమం



పూర్ణాహుతి సమర్పిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరాలయంలో బుధవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా లోక కళ్యాణార్థం మృత్యుంజయ హోమాన్ని నిర్వహించారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. అనంతరం లోకకళ్యాణార్థం గణపతి, నవగ్రహ, మృత్యుంజయ హోమాలను నిర్వహించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఏసీ శంకర్ బాలాజీ, ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిని నియమించండి

రాజుపాళెం : మండలంలోని పర్లపాడు జెడ్పీ హైస్కూల్‌లో గత ఆరు నెలలుగా తెలుగు ఉపాధ్యాయుడు లేడని, వెంటనే నియమించాలని ఆర్ఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ తెలిపారు. రాజుపాళెంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆరు నుంచి 10వ తరగతి వరకు తెలుగును బోధించేవారు లేక విద్యార్థులు ఇబ్బందులకు పుడుతున్నారన్నారు. దీనిపై విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు చొరవ తీసుకుని వెంటనే తెలుగు ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. అనంతరం మండల విద్యాశాఖాధికారి క్రిస్టఫర్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఓ నాయకుడు శ్రీకాంత్ పాల్గొన్నాడు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రొద్దుటూరు : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద చేపడుతున్న సమ్మె రెండో రోజు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు సత్యనారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్మన్ మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. దీక్షా శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, ఆయన తనయుడు కొండారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, పలువురు మాజీ కౌన్సిలర్లు సందర్శించి మద్దతు తెలిపారు.

4 నుంచి కబడ్డీ పోటీలు

ప్రొద్దుటూరు : అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 4 నుంచి 6వ తేదీ వరకు కడపలో కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు బీజేపీ ప్రొద్దుటూరు అసెంబ్లీ కోకన్వీనర్ పర్లపాడు గౌరీశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఈనెల 30వ తేదీలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. విజేతలకు మొదటి బహుమతి రూ.10వేలు, రెండో బహుమతి రూ.5వేలు ఇస్తారని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన వారికి తిరుపతిలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తారని, ప్రథమ బహుమతి రూ.లక్ష, రెండో బహుమతి రూ.50వేలు ఇస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 63012 25355కు సంప్రదించాలని కోరారు.

కరపత్రాల ఆవిష్కరణ

ప్రొద్దుటూరు కల్చరల్ : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో కార్యదర్శి భాను ప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను డిపోలో ఆవిష్కరించి ఉద్యోగులకు పంపిణీ చేశారు. ఈ సందదర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో ఇచ్చిన ఉద్యోగ భద్రతా సర్క్యులర్‌ను అమలు చేయాలని, సిబ్బందికి పాతపద్ధతిలలోనే వైద్యసదుపాయాలు అందించాలని కోరారు. ఎన్ఎంయూఏ కోశాధికారి బాబు, దస్తగిరి, వీటీ.రావు, టీఆర్‌జీ రెడ్డి. ప్రసాద్ పాల్గొన్నారు.

కంప్యూటర్ల అందజేత

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌కు బుధవారం కెనరా బ్యాంకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటిలో భాగంగా రూ.3లక్షల విలువైన 7 కంప్యూటర్లను అందచేశారు. 1979 సంవత్సరం పాఠశాల పూర్వవిద్యార్థి సత్యనారాయణ మంగళూరులో కెనరాబ్యాంక్ డీజీఎంగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన బ్యాంకు సామాజిక బాధ్యతలో భాగంగా కంప్యూటర్లను వితరణ చేశారు. బ్యాంకు కడప రీజన్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మురళీమోహన్ కంప్యూటర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గురప్పకు అందించారు. కెనరాబ్యాంకు డివిజన్ మేనేజర్ రాజశేఖర్, గాంధీరోడ్డు బ్రాంచ్ మేనేజర్ ఉష, శ్రీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏకగ్రీవ ఎన్నిక



బాలజోజి

కలసపాడు : మండలంలోని శంఖవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సముదాయ పాఠశాలల కార్యదర్శిగా లింగారెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఇ.బాలజోజి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణనాయక్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరిస్తాం

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ఇందిరానగర్ కాలనీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : సొంత నిధులు రూ.4లక్షలు చెల్లించి త్వరలో విద్యుత్ లైన్ల సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. గోపవరం గ్రామ పంచాయతీ పరిధిలోని ఇందిరానగర్ ఎస్సీ కాలనీలో ఎమ్మెల్యే బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ కాలనీ ఏర్పాటైన తర్వాత వేసిన 11కేవీ విద్యుత్ లైన్లు కిందే ఉన్నాయని, ఈ కారణంగా తమ ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని తెలిపారు. ఈ విద్యుత్ లైన్ అరకిలో మీటరు వరకు ఉందన్నారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ పాతికేళ్ల పాటు పరిపాలించిన పాలకులు ఈ సమస్యను పట్టించుకోలేదన్నారు. తాను ఓట్లను మాత్రమే చూడనని, హృదయంతో సమస్యను లోతుగా పరిశీలిస్తానన్నారు. ఆ మేరకు విద్యుత్ అధికారులు రూ.4లక్షలు ఖర్చవుతుందని తెలిపారు. తాను వారంలోనే డబ్బు చెల్లించి విద్యుత్ లైన్లను, స్తంభాలను మార్చేలా చర్యలు తీసుకుంటానన్నారు. అలాగే కాలనీలో సిమెంటు రోడ్డు అధ్వానంగా ఉందని, ఈ సమస్యను కూడా పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గద్దా మోషా, వైస్ ఎంపీపీ ఆసం దస్తగిరిరెడ్డి, ఏడీఈ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కొండయ్య, ఆదినారాయణరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ఓబయ్య యాదవ్, ఎమ్మార్పీఎస్ నాయకుడు బాలలక్షుమయ్య మాదిగ, కంబగిరి రాముడు, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదల కోసమే ప్రభుత్వం పనిచేస్తోంది

పేద ప్రజల కోసమే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మీ సమస్యల పట్ల సానుకూలత ఉన్నా ఆర్థిక ఇబ్బందుల కారణంగా పరిష్కారంలో జాప్యం ఏర్పడుతోందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తమ ఆందోళనలో భాగంగా బుధవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఇంటి వద్ద బైఠాయించిన అనంతరం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలందరికి కూడు, గూడు, గుడ్డ కల్పించాలన్న లక్ష్యంతోనే ముఖ్యమంత్రి జగన్ పనిచేస్తున్నారన్నారు. మీ సమస్యలు ఆయనకు తెలుసునని, ఈ ప్రభుత్వం ఏర్పటైన తర్వాత రూ.100 వేతనం పెంచారన్నారు. రెండు వారాలుగా మీరు చేస్తున్న సమ్మె తనకు తెలుసునని, మీరు ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నందువల్లే మీ వద్దకు రాలేకపోయానన్నారు. త్వరలో సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తానన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు సుబ్బలక్ష్మి, విజయ, నాగలక్ష్మి, పద్మ, రాణి, సువార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరమణ

బద్వేలు అర్బన్ : పరిశ్రమల్లో, కర్మాగారాల్లో అనుకోకుండా జరిగే రసాయన పదార్థాల ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ ఆకుల వెంకటరమణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన డివిజన్ స్థాయి క్రైసెస్ గ్రూప్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమిటీ సభ్యులు తరచూ కర్మాగారాలను తనిఖీ చేస్తూ మ్యాపింగ్ చేయాలని, వాటిలో ఎంత మేర రసాయన పదార్థాలు వినియోగించాలి, సంబంధిత యాజమాన్యాలు ఎంత మేర రసాయన పదార్థాలు వినియోగిస్తున్నారో తనిఖీ చేయాలన్నారు. అలాగే ప్రతి ఏటా క్రమం తప్పకుండా ఫైర్ సేఫ్టీ ఆడిట్ నిర్వహించి ఎక్కడైనా లోపాలు ఉంటే సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేసి వాటిని సరిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేకాకుండా ఆయా పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు సంబంధించిన మాక్‌డ్రిల్‌ను నిర్వహిస్తూ ప్రజలకు, కార్మికులకు అవగాహన కల్పించాలన్నారు. నిర్వహణ సామర్థ్యాన్ని పరిశీలించాకే సంబంధిత కర్మాగారాలకు లైసెన్స్‌లు మంజూరు చేయాలని తెలిపారు. సమావేశంలో కర్మాగారాల ఉప ప్రధాన తనిఖీ అధికారి కె.క్రిష్ణమూర్తి, ప్రభుత్వాసుపత్రి డిప్యూటీ సివిల్‌సర్జన్ డాక్టర్ రాంప్రసాద్, అర్బన్ సీఐ యుగంధర్, ఎంపీడీఓ నూర్జహాన్, బి.మఠం ఈఓపీఆర్డీ జాన్‌కెనడీ, ఫైర్‌ఆఫీసర్ కె.వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి

దువ్వూరు : సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం దువ్వూరులోని మండల పరిషత్ కార్యాలయం సభా భవనంలో ఎంపీపీ జయచంద్రారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో మౌలిక వసతులైన విద్య, వైద్యం, తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న వేసవిలో గ్రామాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలోని వివిధ శాఖల పనితీరు, అభివృద్ధి గురించి, చేపట్టబోయే పనులను అధికారులు వివరించారు. వ్యవసాయం, వైద్యం, రెవెన్యూ శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఆరోగ్యశ్రీ కార్డులను సచివాలయ సిబ్బందికి అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి, తహసీల్దార్ రమకుమారి, జెడ్పీటీసీ మేరువ కృష్ణయ్య, మండల పరిషత్ ఉపాధ్యక్షులు పీరుజాద రహమతున్నీసా, మాదం ప్రభావతి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలకు సమాయత్తం కావాలి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఓబులేసు

మైదుకూరు : లౌకిక ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, సమగ్రాభివృద్ధి కోసం పార్టీ శ్రేణులు ప్రజా పోరాటాలకు సమాయత్తం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఓబులేసు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక డీసీఎల్ కల్యాణ మండపంలో సీపీఐ జిల్లా స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ కేంద్రంలో రెండో సారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలకు తిలోదకాలిచ్చిందని ఆరోపించారు. నల్లధనం వెలికితీత, ఏడాదికి కోటి ఉద్యోగాల కల్పనలో విఫలమయ్యారని విమర్శించారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న పనిగంటలు, హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ కంపెనీల దోపిడీకి ద్వారాలు తెరుస్తూ చట్టాలు చేసిందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ రంగ సంస్థలను తెగనమ్ముతూ చివరకు మన విశాఖ ఉక్కును కూడా ప్రైవేటు పరం చేయడానికి పూనుకున్నారని అన్నారు. పెట్రోలు, డీజల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణ బాధ్యత నుంచి కేంద్ర ప్రభుత్వం పూర్తిగా తప్పుకుందన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా, రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, పోలవరానికి నిధులు కేటాయించడంలో, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటులో నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు.సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్.నాగసుబ్బారెడ్డి, మైదుకూరు నియోజకవర్గ నాయకుడు పి.శ్రీరాములు పాల్గొన్నారు.

రేపు 'జగనన్నకు చెబుదాం'



అధికారులకు సూచనలు ఇస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

దువ్వూరు : దువ్వూరు ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం దువ్వూరు ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆర్డీఓ మాట్లాడతూ ఈ కార్యక్రమానికి కలెక్టర్ విజయరామరాజు, జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, జిల్లా స్థాయి అధికారులు హజారవుతారని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. స్థానిక సమస్యలకు మండల స్థాయిలోనే పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ కోరారు. సమావేశంలో తహసీల్దార్ రమకుమారి, ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి, ఎంపీపీ జయచంద్రారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నయం అవుతుంది



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డాక్టర్ హనీఫ్ బాబా

ప్రొద్దుటూరు క్రైం : మండలంలో చేపడుతున్న కుష్టు వ్యాధి గ్రస్తుల గుర్తించే కార్యక్రమాన్ని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హనీఫ్ బాబా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధిని గుర్తించి వైద్యం చేయించుకుంటే పూర్తిగా నయం అవుతుందని తెలిపారు. కుష్టువ్యాధి గ్రస్తుల గుర్తింపు కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా ఈనెల 27 నుంచి జనవరి 12వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ఆశ, ఆరోగ్య కార్యకర్తలు ప్రతి కుటుంబాన్ని సందర్శించి చర్మంపై స్పర్శ లేని మచ్చలు, పాలిపోయిన లేక రాగి రంగులో పొడలు ఉన్న వారిని గుర్తించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఎంఓ శ్రీను, సూపర్ వైజర్ బీవీ వరప్రసాద్, సీహెచ్‌ఓ నాగేంద్ర, హెల్త్ అసిస్టెంట్ చంద్రశేఖర్, ఆరోగ్య కార్యకర్త నాన్సిరాణి, ఆశా కార్యకర్తలు స్వర్ణలత, శ్రీవాణి పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర

చాపాడు : మండలంలోని వెదురూరు, సిద్దారెడ్డిపల్లె గ్రామాలలో బుధవారం వికసిత్ భారత్ సంకల్ప్ బస్సు యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వాలు ప్రజలకు అందించే పథకాలను గురించి అధికారులు వివరించారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ సుబ్బరాయుడు, బీజేపీ మండల అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, వైద్యాధికారి ఓబులేసు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల అంబేద్కర్ సర్కిల్‌లో బుధవారం 16 వ రోజు అంగన్వాడీలు సమ్మె కొనసాగించారు. 16 ఆకారంలో కూర్చుని నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భైరవప్రసాద్ మాట్లాడుతూ అంగన్‌వాడీల వేతనాలు పెంచుతామని నాయకులు హామీ ఇవ్వాలన్నారు. ప్రభుత్వం దిగిరాకపోతే నిరవధిక నిరాహారదీక్ష చేపడతామన్నారు.

ఆర్డీఓకు వినతి

దువ్వూరు : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వరుసగా దువ్వూరులోని తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ నేతలు ఆయేషా, సుజిని, దాక్షాయని మాట్లాడుతూ తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆర్డీఓకు వినతి పత్రం అందించారు.

ధర్నాకు అనుమతివ్వాలని వినతి

కలసపాడు : తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గురువారం కడప కలెక్టరేట్ కార్యాలయం జరిగే ధర్నాలో పాల్గొనేందుకు అనుమతి ఇవ్వాలని బుధవారం మండలంలోని వీఆర్‌ఏలు తహసీల్దారు రవీంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం వీఆర్‌ఏల కష్టాన్ని గుర్తించాలని, డీఏ జీవో విడుదల చేయాలని కోరారు. వీఆర్‌ఏలు స్టీఫెన్, గిరి, గురప్ప, షామీర్‌బాష, పాండురంగయ్య, కాశయ్య పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం

కడప అర్బన్: కడప నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అగాడివీధికి చెందిన పఠాన్ షాషా (18) అనే యువకుడు ఈనెల 23వ తేదీ నుంచి కనిపించడం లేదనీ అతని తల్లి పఠాన్ షాహినా బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పఠాన్ షాబుద్దీన్, షాహినాకు ముగ్గురు కుమారులు వున్నారు. వారి రెండవ కుమారుడు తన స్నేహితులతో కలిసి ఈనెల 22వ తేదీన తాడిపత్రికి వెళ్లి వచ్చాడు. ఆలస్యంగా ఇంటికి రావడంతో తల్లి మందలించింది. తరువాత రోజున ఇంటిలో ఎవరూలేని సమయంలో, ఎవరికీ చెప్పకుండానే వెళ్లిపోయాడు. అప్పటి నుంచి అతని తల్లిదండ్రులు, బంధువులు యువకుడి ఆచూకీ కోసం వెతికారు. ఎక్కడా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు కడప టూటౌన్ ఎస్ఐ తెలిపారు.

ఎర్రగుంట్లలో 'లిల్లీ' సందడి



థియేటర్‌ను ప్రారంభిస్తున్న చైల్డ్ ఆర్టిస్టు నేహా

ఎర్రగుంట్ల : పట్టణంలోని ఎస్ఎస్‌వీ సినిమా థియేటర్‌లో లిల్లీ సినిమా చైల్డ్ ఆర్టిస్టు నేహా సందడి చేసింది. ఆధునిక హంగులతో తీర్చిదిద్దిన ఎస్ఎస్‌వీ సినిమా థియేటర్‌ను బుధవారం లిల్లీ మూవీ చైల్డ్ ఆర్టిస్టు నేహ పునఃప్రారంభించారు. ఈ సినిమాను చూడడానికి పెద్ద సంఖ్యలో పిల్లలు, పెద్దలు వచ్చారు. లిల్లీ సినిమా నిర్మాత బాబురెడ్డి, థియేటర్ యాజమన్యం, పాల్గొన్నారు.

రూ.30 వేలు వితరణ



గోవిందు దంపతులకు నగదు అందజేస్తున్న రాజనారాయణరెడ్డి

కాశినాయన : మండలంలోని ఓబుళాపురం గ్రామానికి చెందిన నిరుపేదలైన మునగల గోవిందు, సిద్దమ్మల కుమార్తె వివాహం సందర్భంగా పిట్టిగుంట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బుసిరెడ్డిరాజనారాయణరెడ్డి రూ.30 వేలు వితరణగా అందజేశారు. ఆయనకు వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు రాజారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికి గర్వకారణం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ తదితరులు

పోరుమామిళ్ల : రాష్ట్రంలో ఏర్పాటుచేసిన సచివాలయ వ్యవస్థ దేశానికే గర్వకారణమని, మహాత్మా గాంధీ ఆశించిన గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆచరణ సాధ్యం చేశారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. బుధవారం పుల్లివీడులో నూతన సచివాలయం, రైతుభరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను వారు ప్రారంభించారు. అనంతరం సంచర్ల పంచాయతీ నాగలకుంట్లలో రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలకు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుల్లివీడు పంచాయతీలో అభివృద్ధి పనులు, సంక్షేమపథకాలకు రూ.30 కోట్లు, సంచర్ల పంచాయతీకి రూ.22 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజలు మండల కేంద్రానికి పరుగులు పెట్టే పరిస్థితి మారి పోయిందన్నారు. ఇంటి ముంగిటే వైద్యం, వ్యవసాయ సలహాలు, ఎరువులు, ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. పాలనా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పథకాల అమలులో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు డబ్బు వేస్తున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ రావాలన్నారు. జగనన్నకు ప్రజల ఆశీస్సులు అందించాలన్నారు. కార్యక్రమంలో ఫుడ్ కార్పొరేషన్ చైర్మెన్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి, పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి, ఆప్కాస్ స్టేట్ డైరెక్టర్ డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీలు సియం బాష, రాజశేఖర్, సర్పంచులు, ఎంపీటీసీలు, ఈఈ నాగరాజు, మండల, పంచాయతీ స్థాయి నాయకులు, వైద్యసిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలోనే సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాల సూచిక బోర్డును ఆవిష్కరిస్తున్న పరిమళ, ప్రవల్లిక

రాజుపాళెం : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక అర్హత ఉన్న వారందరికి సంక్షేమ పథకాలను అందాయని మండల సచివాలయ కన్వీనర్ శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని మండలంలోని పర్లపాడు గ్రామంలో బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు కసిరెడ్డి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను సచివాలయ కన్వీనర్ పరిమళ, ఎంపీటీసీ సభ్యురాలు ప్రవల్లికలు ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల నమ్మకానికి జగనన్న నిదర్శనమని, టీడీపీ నాయకులు చెప్పే కల్లబొల్లి మాటలకు ఎవరు మోసపోవద్దని తెలిపారు. సచివాలయ కన్వీనర్ పరిమళ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం వచ్చాక గ్రామంలో రూ.13,07,43,188 వివిధ పథాకల ద్వారా లబ్ధి చేకూరిందని, గ్రామంలో అభివృద్ధి పనులు జరగాయన్నారు. సీఎంగా జగనన్నను, ఎమ్మెల్యేగా రాచమల్లు శివప్రసాదరెడ్డిని తిరిగి మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జగదీశ్వరరెడ్డి, సుదర్శన్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు నాగిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు శివనాగిరెడ్డి, ఈఓపీఆర్డీ షాకీర్‌ఆలీఖాన్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, ఆయా గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మత్స్య సహకార సంఘం సభ్యులకు రుణ అర్హత పత్రాలు అందజేస్తున్న అధికారులు

బద్వేలు అర్బన్ : మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందించే వివిధ రకాల పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ ఆఫ్ మెరైన్ ఇంజినీర్ కె.మణిమారన్, ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎ.కిరణ్‌కుమార్‌లు పేర్కొన్నారు. బుధవారం స్థానిక దర్గావీధిలోని హుస్సేన్‌పీర్ దర్గా ఆవరణలో నిర్వహించిన మత్స్య సహకార సంఘం సభ్యుల సమావేశంలో వారు మాట్లాడుతూ వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని చేపల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు కిసాన్ క్రెడిట్ కార్డును అందజేసి వారికి 40 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో మత్స్యకారుల జీవితాలు మరింత మెరుగు పడనున్నాయని అన్నారు. సమావేశంలో మత్స్య సహాయకులు వై.కొండయ్య, మత్స్య సహకార సంఘం అధ్యక్షులు మిరపల్లెవెంకటరమణ, ఉపాధ్యక్షులు చింతలనాగేంద్రరావు, కార్యదర్శి గగ్గెరవెంకటయ్య, డైరెక్టర్లు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కృతజ్ఞత దివ్యబలిపూజ



దివ్యబలిపూజ నిర్వహిస్తున్న రెవ. ఫాదర్ దలాయిరవి

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని ఎల్లుగారిపల్లె గ్రామంలోని ఆరోగ్యమాత మంటపంలో బుధవారం కృతజ్ఞత దివ్యబలిపూజ నిర్వహించారు. ఎల్లుగారిపల్లె గ్రామానికి చెందిన దలాయిరవి ఈ నెల 23న కడప మేత్రాసన పీఠాధిపతి డాక్టర్ గాలి బాలి సమక్షంలో గురువుగా అభిషిక్తులైన సందర్భంగా తన తొలిపూజను స్వగ్రామంలో జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవుని ఆధ్యాత్మిక సేవలో పనిచేస్తూ సకల జాతిజనులకు సువార్తను బోధించి మోక్షమార్గం వైపు నడిపించేందుకు కృషి చేస్తానని తెలిపారు. నూతనంగా గురువుగా అభిషిక్తులైన దలాయిరవిని గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో రెవ. ఫాదర్ విల్సన్, బాలసుందరం, అనిల్, సాగర్, దేవా, మదర్ సెల్విరాయప్పన్, శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపకులు ప్రసాద్, ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం కమిటీ అధ్యక్షుడు నీరోళ్ళ మోహన్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాగనాధీశ్వరుని కొండ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న శెట్టిపల్లి నాగిరెడ్డి

ఖాజీపేట : నాగనాధీశ్వర కొండ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, భక్తులకు మేరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని మైదుకూరు నియోజక వర్గ సమన్వయ కర్త శెట్టి పల్లి నాగిరెడ్డి అన్నారు. నాగనాధీశ్వర కొండ చైర్మన్‌గా గుమ్మ నాగలక్ష్మిరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో నాగిరెడ్డి మాట్లాడుతూ ఆలయం కొండ పై 108 అడుగుల విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించడం సంతోషకరమన్నారు. అందుకు తన వంతు సహాయం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, ఎంపీపీ అబుబకర్ సిద్ధిక్, ఎంపీటీసీ శ్రీనివాసులు, సర్పంచ్ పెద్దిరెడ్డి. మండల కన్వీనర్ మురళీమోహన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ గోపాల్, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు మున్వర్ తోపాటు స్థానిక నాయకులు పాల్గోన్నారు.

మినీ గ్రంథాలయం తనిఖీ



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న మండల గ్రంథాలయాధికారి

చాపాడు : గ్రామాల్లో ఏర్పాటు చేసిన మినీ గ్రంథాలయ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి జే.శివశంకర్‌రెడ్డి అన్నారు. మండలలోని నక్కలదిన్నె గ్రామంలోని మినీ గ్రంథాలయాన్ని బుధవారం గ్రంథాలయాధికారి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలకు ప్రజలకు సైతం గ్రంథాలయ సేవలు అందించేందుకు ప్రభుత్వం మినీ గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తోందన్నారు. మినీ కేంద్రాలలో దినపత్రికలతో పాటు వినోధ, విజ్ఞాన పుస్తకాలను అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో బీడీసీ రవిశంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రవి తదితరులు పాల్గొన్నారు.